ట్లోనిపాము రక్తపింజెరగా మారింది. అది వందలాది రక్తపింజెరలను సృష్టిస్తున్నది. గదినిండా రక్తపింజెరలు వికటాట్టహాసం చేస్తున్నాయి. శరీరంపైన పైనుండి పడుతున్నాయి. చేతులపైన కాళ్ళపైన, కడుపుపైన పాకుతున్నాయి. మెడపైనపాకి గొంతు నులిమివేస్తున్నాయి. మెదడులో ప్రవేశించి నా స్మృతిని నాశనం చేస్తుండగా "అమ్మా ఆ కిటికీ తలుపులు వేసెయ్యి"మని గట్టిగా చిత్కారం చేసాను. అంతే—ఆ తరువాత ఏమిజరిగిందో నాకు తెలియదు.

అది మొదలు నాకు వెన్నెలంటే, భయం. చీకటిరాత్రుళ్ళలో ఏమీ భయంలేకుండా ఎక్కడికి పడితే అక్కడికి వెడతాను. కాని వెన్నెల రాత్రుళ్ళలో చీకటి పడడంతోనే, గదిలోంచి ఎక్కడికీ కదలను. పైగా వెన్నెలని కూడా గదిలోకి చొరనివ్వకుండా, కిటికీతలుపులన్నీ బంధించివేస్తాను.

---

స్కెచ్

# చీకటిచారలు

"రావు"

సన్నని దీపపుకాంతిలో చేతి వాచీ చూసుకున్నాను. రెండు గంటలయింది. భయంకరమయిన నిశ్శబ్దం అలుముకొంది యిల్లంతా. కటిక చీకటికంటె దారుణంగా ఉంది ఆ నిశ్శబ్దం. ఏదో ఆలోచిస్తూ పడకకుర్చీలో కూర్చున్నాను. ఆలోచనలు ఒక్క బర్రెమీద నడవ్వు. ఏమిటో ఆలోచించానో ఇప్పుడు చెప్పటుంటే కష్టపడతాను. అంతూపొంతూలేని రకరకాల ఆలోచనలు. ఎందుకో ఆవేదన. భయం. సంతోషంలా ఉండే అనుభూతి. బాధపడ్డానా? సంతోషించానా?—ఏమీ చెప్పలేను. మత్తుమందు మింగినవాడిలా కూర్చున్నాను. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ అగిఅగి ఉప్పెనగా వస్తున్న భయానకమైన మూలుగులు లోపల. మనస్సు వికలమైంది. ఒంటరితనం అసలే భరించలేకుండా ఉన్న నాకు బాధను కలిగించే మూలుగులు మరికొంత కలతపరచింది.

రెండున్నర.

ఎంత మంచి గంట! ఇల్లంతా ఒక్కమాటు మారిపోయింది! సంతోషంతో కిలకిలలాడింది ఇల్లు! గుడ్డిదీపం గ్లాసులైటు వెలుగు తెచ్చిపెట్టింది. సంతోషంతోకూడిన గాద్గదస్వరంతో అమ్మ అంది ఇవతలకొచ్చి. "అబ్బాయి! మగపిల్లాడు" అమ్మ మొహంకేసి చూశాను ఆ దీపం కాంతిలో-సంతోషంతో తొణికిసలాడింది అమ్మ మొహం! అమ్మకోసం నవ్వాను. అదైనా గట్టిగా కాదు చిన్నగా, మరీ చిన్నగా నవ్వాను. చిరునవ్వులాటిది! అమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

నేను ఒక తండ్రిని! 'హు' అన్నాను అప్రయత్నంగా. అది నవ్వుగా ఉంటుందేమో మిగతా వారికి. కాని చాలా పేలవమయింది. మిగతా రాత్రి అంతా జాగారంచేసాను. నిద్రపోవాలని లేదు. కాదు. నిద్రరాదు. ఇంతవరకూ భరించలేని కటిక చీకటి. భయంకర నిశ్శబ్దం. ఇప్పుడు పట్టలేని సంతసం. కట్టలు తెంచుకొని పరుగులెత్తినది ఉత్సాహం!

ఉదయాన్నే నడిబజారున నడుస్తున్నాను పోస్టాఫీసువైపు. అనేక కార్లు చిన్నవి, పెద్దవి దూసుకుపోతున్నాయి.గడ్డాలుపెంచిన 'బూచాళ్లు' కూడా నడుస్తున్నారు. ఈ 'మాయ' అంతా వెలుగుచీకట్ల కలయిక అనుకున్నాను. శరీరంను దాచుకోవడానికి వీలులేని చింకి పేలికలు కట్టిన ముష్టిదాన్ని చూసాను. పసిడిలా మెరుస్తున్న దబ్బపండు రంగులో 'స్పాంజి'లా ఉబికిన మెత్తని శరీరాన్ని బయటపెట్టడానికి ఉరకలు వేస్తున్న సన్నని వాయలుచీర కట్టిన ఒక 'అదృష్టపు జాతి తాను' లోని 'ఒక ముక్క'నూ చూశాను. బీద, సంపదా పడుగు, పేకలుగా అల్లిన నేతగుడ్డ యీ ప్రపంచం అనుకున్నాను.

కాఫీహోటలులో దూరాను కాఫీకోసం. అక్కడా అంతే. 'సర్వెర్' బాధ్యత వడ్డించడం. బల్లమీద విలాసంగా విసరబడ్డ డబ్బుల్ని తనముందున్న 'గళ్ళాల్లో'కి లాక్కోవడం అయ్యర్ వంతు. ఏమిటీ అన్యాయం! ఎవర్ని అడగను!

దారిలో కనబడ్డాడు పంతు. "ఏంరా పంతూ ఎక్కడికి" అనకుండానే "ఆఫీసుకు" అన్నాడు ఏక ఆఫీసు. ఆఫీసు. గుమాస్తా చిన్న పెళ్ళాం ఆఫీసు. తనని పోషించే, తనకు ఆకారమునిచ్చే గుమాస్తాను ఆఫీసు, గుమాస్తాను పోషించదు. పైగా వాడి ఆయుర్దాయాన్ని పుచ్చుకుంటుంది మాయ ఆఫీసు!

పోష్టాఫీసుకువచ్చి నాలుగు కార్డులు కొని వ్రాసాను ఇలా పురుడువచ్చింది, తల్లీబిడ్డా కులాసా అని. ఏదో నిర్వికారంగా వ్రాశానుగాని ఒక సంతోషంగాని ఒక విచారంలాటిది గాని కలగక పోవడం ఆశ్చర్యంగానే ఉంది. పైగా ఇంకా ఏదేదో అనుకున్నాను... నా తండ్రికూడా నే పుట్టినప్పుడు ఇలా అనుకున్నాడా? ప్రపంచంలోని మనుష్యులంతా నాలాటివాళ్ళే అయితే? భయంతో వణికిపోయాను. సిగ్గుతో కుమిలిపోయాను. అభిమానంతో తలవంచాను. నిస్సహాయతచే కళ్ళనీళ్లు రాల్చాను. ఏమిటిది?

డబ్బు తీయడానికి 'సేవింగ్స్ బ్యాంకు' అరదగ్గరకు వచ్చాను. ఆ గుమాస్తా 'డిపాజిటార్'తో పేచీపడుతున్నాడు. గుమాస్తా కళ్ళు నిప్పులు చెదురుతున్నాయి. వణుకుతున్నాయి. ఇంకా ఏదేదో అంటున్నాడు. ఇవతల మనిషికూడా ఏదో అంటున్నాడుగాని అంత ఇదిగాలేదు కంఠం తీరు.

నేను అడక్కుండానే 'సేవింగ్సు క్లార్కు' చెప్తున్నాడు నాతో "దొంగవెధవ! పదిరూపాయలు కాచేసాడు చూడండి పదిరూపాయలు. వెళ్ళొచ్చాయి..."

నా గొడవలో నేను ఉన్నాను. వినే ఓపిక లేదు. అయినా వినాలి. "పాపం ఏదో చాలక." అనడానికి ప్రయత్నించాను.

"ఏడిశాడు వెధవ. నాలుగు వేలున్నాయి, నాలుగువేలు. సాటి గుమాస్తాగాడు. ఏదో ఆఫీసు లెండి"...

పాపం! ఆ సాటి గుమాస్తా వెళ్ళిపోయాడు. ఇంకా చెప్తూనే ఉన్నాడు నాకు.

"25వ తారీకు ఆవేళ. మామూలుగా డబ్బు తీయడానికి వచ్చాడు. ఒక పదినోటు ఖంగారులో ఎక్కువ ఇచ్చాను. పట్టుకుపోయాడు దొంగ వెధవ. నాకు బాగా గుర్తు వాడికేఇచ్చాను. నాకు తెల్సు వీడే! పోష్టుమాష్టరు కూడా చెప్పారు. ఊహూ! ఇవ్వలేదు దొంగవెధవ! సాటి గుమాస్తా అనైనా లేదు. ఆవారం ఎంత కష్టపడ్డానో! ఏదో అయిపోయిం దనుకోండి! నన్ను తరుచు వచ్చి కాల్చుకుతింటాడు. వాణ్ణి చూస్తే మండిపోతాను. ఆ నెల ఆఖరివారం అయిపోతాను."

నేనేదో సముదాయించి ఇవతలకొచ్చాను నా పనిచూసుకొని. కాని ఆ గుమాస్తాలిద్దరూ నా కళ్ళపడుతూనే ఉన్నారు రోడ్డుమీదగూడా. పది రూపాయలు, పదిరూపాయలంటూ, పదిమాట్లయినా అనిఉంటాడు. ఎంత బాధపడ్డాడో పాపం! ఆ నెల ఆఖరివారంలాగ అయిపోతా. రెండవవాడిమీద తగని కోపంవచ్చింది నాక్కూడా. అక్బరు కాలంలో కరువు వచ్చింది. కరువు ఎంత భయంకరందంటే మనుష్యుల్ని మనుష్యులు చంపుకుతిన్నారట. దీనికి దానికి తేడా ఏమిటి? సాటి గుమాస్తామీదపడి పదిరూపాయలు నంజుకోవడం! ఏమయినా ఇంక అతన్ని మనం ఏమీ అనకూడదు నన్ను అడిగితే. అభిమానంతో ఉడికిపోతున్నాడు.

వెనకాల 'బ్రేకు' వేసిన చప్పుడయింది. వెనుదిరిగి చూసాను. ఒక గణపతి కారులోంచి తొంగి చూస్తూ 'జాగ్రత్తగా నడు. బ్రతికేరోజు లేదా?' అన్నాడు కోపంగా. నవ్వుతూ అన్నాను "చాలా నిజం!" అని. గణపతి చిన్నబుచ్చుకొని తుర్రుమన్నాడు.

ప్రపంచంలో ఎన్ని రకాలు! నా కొడుకు ఏ రకంలోకి వస్తాడో ముందుముందు. మళ్ళీ భయంతో కంపించాను. ఎందుకో ఈ మనుష్యులంటే నాకు భయం. వాళ్ళ పోలిక రాకూడదు. ఏ ఒక్కరి జీవితం చీకటిలేని వెన్నెలరాత్రి కాలేదు. ఏ ఒక్కరి పోలికా వాడికి రాకూడదు. ఎలా?